

## ఉద్యోగ మేళాలో 16 మంది ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వికాస ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉద్యోగమేళాలో 16 మంది నిరుద్యోగ యువత వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వికాస కేంద్రంలో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శనివారం వికాస కేంద్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం బహుళజాతి కంపెనీల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా రిసోర్స్ పర్సన్ సత్యనారాయణను సంప్రదించాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కలెక్టర్ అభినందించారు. వికాస జరిగిన జాబ్ మేళాకు 48 మంది హాజరయ్యారని, వారిలో 16 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. వికాస మేనేజర్ సత్యనారాయణ, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలకు చొరవ చూపాలి

### లబ్ధిదారులకు కలెక్టర్ మాధవీలత సూచన

ప్రజాశక్తి - చాగల్లు

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు స్వచ్ఛందంగా చొరవ చూపాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. శనివారం చాగల్లులోని జగనన్న కాలనీలో కొత్త లే-అవుట్‌లను ఆమె పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వం ఉచితంగా అందించిన స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇతరులు ఆక్రమించుకోవడం, పక్కింటి ప్రహరీ మన స్థలంలో నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. ఇంటి నిర్మాణం కొంత శ్రమతో కూడుకున్నా, వారసులకు ఒక ఆస్తి హక్కు కల్పించే చక్కని అవకాశం ఉందన్నారు. ప్రభుత్వమే ఇంటి నిర్మాణం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఇసుక, ఇతర నిర్మాణ సామాగ్రి, నీటి వసతి కల్పిస్తున్నదన్నారు. ఇంటి నిర్మాణం చేపడితే దశలవారీగా చెల్లింపులు బ్యాంకు ఖాతాలకు నేరుగా జమవుతున్నాయన్నారు. ఇంటి నిర్మాణం కోసం ముందస్తు పెట్టుబడిగా అవసరమైన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా ఎస్‌హెచ్‌జి మహిళా సభ్యులకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ లే-అవుట్‌లలో విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి పనులను దశల వారీగా ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసిన వారికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నామని తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా చాగల్లులో పాత లే అవుట్‌లో ఉన్న సుమారు 1100 గృహాలకు రూ.51 లక్షలతో ఇంటింటా కొళాయి కనెక్షన్ ఇస్తున్నామన్నారు. కొత్త కాలనీ వాసులకూ కనెక్షన్లు ఇస్తామని, ప్రస్తుతం ఇది టెండర్ దశలో ఉందన్నారు. కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, ఎంపిడిఒ బి.బి.రాంప్రసాద్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నిరంజన్‌కుమార్, హౌసింగ్ ఎఇ ఏడుకొండలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుర్జన్, మండల గ్రీవెన్స్ ఆఫీసర్ బి.వెక్టర్, సచివాలయ కార్యదర్శులు, ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

**తాళ్లపూడిలో:** జగనన్న ఇళ్ల నిర్మాణాలు గజ్జరం గ్రామంలో సంతృప్తికరంగా ఉన్నప్పటికీ నూరు శాతం నిర్మాణాలు పూర్తి అయ్యేలా కృషి చేయాలని ఎంపిడిఒ ఎం.రాజశేఖర్ కోరారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న గృహ దినోత్సవంలో భాగంగా శనివారం గజ్జరంలో అధికారులు పర్యటించారు. నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒతో పాటు సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, కార్యదర్శి హేమంతి, గృహ నిర్మాణ శాఖ ఎఇ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు కృష్ణవేణి

# విఒఎలకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ధవళేశ్వరం

ఐకెపి యానిమేటర్లకు కనీస వేతనాలు చెల్లించాలని యానిమేటర్ల సంగం ఉమ్మడి జిల్లా సమావేశం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ధవళేశ్వరంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ నాయకులు గంగాభవాని, ప్రమీల అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడారు. యానిమేటర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. రాజకీయ వేధింపులతో తొలగించిన యానిమేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రమీల మాట్లాడుతూ అనేక చోట్ల ఎపిఎం, సిసిలు యానిమేటర్లను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. దీనికి నిదర్శనమే అయినవిల్లి మండలంలో జరిగిన ఘటన అన్నారు. తొలగించిన విఒఎలను ఏళ్ల తరబడి విధుల్లోకి తీసుకోకుండా రోడ్డున నెట్టేస్తున్నారని వాపోయారు. తప్పులు చేసిన కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన ఎపిఎం మాత్రం ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. వెంటనే తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మేరి, సుబ్బలక్ష్మి, ఇ.సంతోషమ్మ, జ్యోతి, విజయ, కాంతరత్నం, వివిధ మండలాల యానిమేటర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా జోన్‌లోకి మరో 229 ఎకరాలు

### 2వ ఫేజ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



జిల్లాలో 229.09 ఎకరాల్లో నాన్ ఆక్వా జోన్ పరిధిలోని చెరువులను రెండే ఫేజ్‌లో ఆక్వా జోన్‌లోకి మార్పు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం పెంపొందించే దిశలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఎల్‌ఎస్‌లో రెండు ఫేజ్‌లో 106 మంది రైతులకు చెందిన 229.09 ఎకరాలను ఆక్వా జోన్‌లోకి మార్చామన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారి కెవి.కృష్ణారావు, ఇతర సమన్వయ శాఖల అధికారులతో కలిసి 2వ ఫేజ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మత్స్య రంగానికి మరింత ప్రోత్సాహం అందించి మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా ఆక్వా రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆదిశగా జిల్లా స్థాయి కమిటీ నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జిల్లాలోని ఆరు మండలాల్లో గుర్తించిన 9 మండలాల్లో 29 గ్రామాల్లో 1,197.02 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 967.93 ఎకరాలను జిల్లాలోని నాన్ ఆక్వాజోన్ నుంచి ఆక్వా జోన్‌గా మార్చేందుకు ఫేజ్-1లో ఆమోదించామన్నారు. ఇంకా జిల్లాలో 1,529 ఎకరాలు నాన్ ఆక్వా జోన్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రామ సభలో ఆమోదం పొందని కారణంగా అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్‌టిజి.సత్యగోవింద్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జెఎసి నాయకులు

# కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎపి జెఎసి నాయకుల బృందం శనివారం కలెక్టర్ కె.మాధవీలతనుకలిసి సమ్మె నోటీసు అందించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో వారు కలెక్టర్‌ను కలిశారు. ఉద్యమ కార్యాచరణను వివరించి, సహకరించాలని కోరారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల అధికారులను కలిసి ఉద్యమ కార్యాచరణ వివరించారు. నగరంలో, డివిజన్, మండల కేంద్రాల్లో వివిధ శాఖల ఉద్యోగులను కలిసి కరపత్రాలు పంచారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ ఎం.కాంతిప్రసాద్, ఎపిఆర్ఎస్ఎ జిల్లా అధ్యక్షులు గొలుగూరి బాపిరాజు, జిల్లా ట్రెజరర్ వి.శ్రీనివాస్, రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షులు సిహెచ్.సురేష్‌బాబు తదితరులున్నారు.

# చందనకు నర్సరీ రైతుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కడియం

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు నర్సరీ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కాలంలో కడియం నర్సరీలకు విద్యుత్ సరఫరాను విడతల వారీగా అందిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించే సమయాల్లో విద్యుత్ సరఫరా చేయడంతో నర్సరీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలం క్రితం వరకు పగటిపూట నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేసేవారు. ప్రస్తుతం తెల్లవారుజామున కొన్ని గంటలు, మరో సమయంలో మరికొన్ని గంటలు విద్యుత్ సరఫరా ఇస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో నర్సరీ రైతులు ఈ సమస్యను 2 రోజుల క్రితం చందన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో చందన మాట్లాడడంతో ఈ నెల 5 నుంచి నిరంతరాయంగా పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులు అంగీకరించారు. ఈ సందర్భంగా నర్సరీ అసోసియేషన్ తరపున చందనకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ సమస్యపై చందనకు వినతిపత్రం అందజేస్తున్న నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు, రైతులు (ఫైల్)

# పలుచోట్ల న్యాయ విజ్ఞాన సదస్సులు

ప్రజాశక్తి - కోరుకొండ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి ఆధ్వర్యంలో శనివారం కోరుకొండ ఎంపిడిఒ కార్యాలయంలో న్యాయ అవగాహనా సదస్సును నిర్వహించారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు' ను పురస్కరించుకుని మార్చి 4 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సదస్సులో మహిళలతో ప్రత్యూషకుమారి మాట్లాడారు. న్యాయ పరమైన సమస్యలుంటే స్థానిక కోర్టుల్లో గల మండల న్యాయ సేవాధికార కమిటీని లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందొచ్చని మహిళలకు సూచించారు. మహిళల చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వివివిఎస్ఎస్.కుమారి, మండల సమాఖ్య అధ్యక్షులు జి.మానస, డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఇ.శ్యామ్‌సుందర్, ప్యానల్ అడ్వకేట్ డి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ ఇ.రాధాకుమారి పాల్గొన్నారు.




కోరుకొండలో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

**కొవ్వూరు రూరల్ :** మండలంలోని అరికరేవుల గ్రామ సచివాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా దినోత్సవ వారోత్సవాలు జరుపుతున్నట్లు కొవ్వూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.బాలా త్రిపుర సుందరిదేవి తెలిపారు. ఈ వారోత్సవంలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పైబడినా దేశంలో మహిళలు ఇంకా వెనుకబడే ఉన్నారన్నారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు టివిపి.లక్ష్మి, డి.రవికుమార్, పంచాయతీ సర్పంచ్, సిబ్బంది, గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.



అరికరేవులలో మాట్లాడుతున్న బాలాత్రిపురసుందరీదేవి

# 'నన్నయ'లో మేనేజ్‌మెంట్ వర్క్‌షాపు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజెమెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. వాణిజ్యం, నిర్వహణ మానవీయ శాస్త్ర పరిశోధన పద్ధతి అనే అంశంపై యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ వర్కుషాపునకు రిజిస్ట్రార్ టి.అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశోధనలు బాగా జరిగితేనే కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. రిసోర్స్ పర్సన్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సీనియర్ ప్రొఫెసర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ పరిశోధన అనేది మానవ అనుభవంలో అతి ముఖ్యమన్నారు. సాంఘిక శాస్త్ర పరిశోధన అనేది మానవ సమాజంలో సామాజిక సంఘటనలను వెలికితీయడానికి దోహదపడుతుందన్నారు. పరిశోధన అనేది నిరంతర ప్రక్రియ అని, పిహెచ్.డి తరువాతే అసలైన పరిశోధన మొదలవుతుందన్నారు. పరిశోధన విద్యార్థులు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి, డాక్టర్ ఎం.రమేష్, జె.రవిశంకర్, డాక్టర్ ఐఎస్ఎన్.రాజు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎస్.శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యఅతిథులను సత్కరిస్తున్న నన్నయ సిబ్బంది

# 'గురుకులం'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023 -24 విద్య సంవత్సరంలో ఐదో తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్, ప్రిన్సిపల్ ఎంఎస్.సాయినాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గోపాలపురం(బాలికలు), కొవ్వూరు మండలం వాడపల్లి(బాలురు), రాజమండ్రి రూరల్ బొమ్మూరు(బాలికలు), అనపర్తి మండలం మల్లంపూడి(బాలురు) గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒసి, బిసి, ఇబిసిల విద్యార్థులు మార్చి 6 తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించరాదన్నారు. ఇతర వివరాలకు గోపాలపురం బాలికలు(9440265787), వాడపల్లి (బాలురు) 9160505522, బొమ్మూరు(బాలికలు)8985461772, అనపర్తి మండలం మల్లంపూడి (బాలురు) 9849642721 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# విద్యాసంస్థల్లో ప్రవీణ్ ప్రకాష్ తనిఖీలు

ప్రజాశక్తి- గోకవరం, కడియం

జిల్లాలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి జిల్లాలో పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలో నాడు-నేడు కార్యక్రమంలో రూ.20 లక్షలతో చేస్తున్న పనుల్లో జాప్యంపై సంబంధిత అధికారులు, ప్రిన్సిపల్‌ను ఆరా తీశారు. పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారి వద్ద వివరాలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌జెడి జి.నాగమణి, డిఇఒ అబ్రహం ఉన్నారు. కడియం మండలంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.కడియం బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. హాస్టల్లో విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి, విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో బోధనా తీరును సమీక్షించారు. ఈ నెల సిలబస్ ప్రకారం నోట్స్ అప్‌డేట్‌గా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఇఒ వి.లజపతిరాయ్ పనితీరును అభినందించారు. ఆయన వెంట ఉప విద్యాశాఖ అధికారి తులసీదాస్, ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, ఇవిఎస్ఆర్.ప్రసాద్, యు.వీరభద్రరావు, జెఎ.రాము ఉన్నారు.

# ప్రతిభా పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గన్నమని శేషగిరిరావు స్మారక ప్రతిభా పాటవ పరీక్షలు మండల వ్యాప్తంగా శనివారం విజవంతంగా నిర్వహించామని ఎంఇఒ పివిఎస్.నాగరాజు తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ పాఠశాల-1లో ఈ పరీక్షలను నిర్వహించామన్నారు. మండల వ్యాప్తంగా ప్రతీ ఏడూ 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 84 మందికి 79 మంది హాజరయ్యారన్నారు.

# 'పతనం దిశగా జగన్ ప్రభుత్వం'

ప్రజాశకిత - రాజమహేంద్రవరం

అవినీతి, అసమర్థ పాలనతో జగన్ ప్రభుత్వం పతనం దిశగా సాగుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 10వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజల్లో ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. వీటిని ప్రజలందరూ గ్రహిస్తున్నారన్నారు. 2024లో టిడిపి విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, యువ నాయకులు వాసిరెడ్డి బాబి, టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరావు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, కార్యదర్శి మహబూబ్ ఖాన్, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బుడ్డిగ రవి, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం ధర్నా

ప్రజాశక్తి - రాజానగరం

మెరుగైన వైద్యం అందించాలంటూ స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద రాజాగనరం గ్రామస్తులు శనివారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రంపచోడవరానికి చెందిన గిరిజన మహిళ పి.విజయ 15 రోజుల క్రితం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకుంది. ఆరోగ్యం మెరుగ్గానే ఉందని వైద్యులు ఆమెను మూడు రోజుల క్రితం ఇంటికి పంపించారు. అయితే ఇంటి వద్ద ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను మళ్లీ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో బాధితురాలు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంది. సమాచారం అందుకున్న గ్రామస్తులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఆసుపత్రి సిబ్బంది నిలదీశారు. ఆవరణలో ధర్నా నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ రోగిని పరీక్షించి ఇన్ఫెక్షన్ జరిగిందని మూడు రోజులు ఉంచి ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటే సరిపోతుందని తెలిపారు. దీంతో వారు ఆందోళన విరమించారు. మెరుగైన వైద్యం అందించి ప్రజలకు అందుబాటులో వైద్యులు ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కె.నాగబాబు, ఎం.శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌సి ఓటర్లకు గుర్తింపు కార్డుల జారీ

ప్రజాశక్తి - పెరవలి

ఈ నెల 13న జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేశామని ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. మండలంలో 20 ఎంపిటిసి సభ్యులు, ఒక జడ్‌పిటిసి సభ్యునికి వీటిని జారీ చేశామన్నారు. వీరు కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు.

# రుడా కార్యాలయంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) కార్యాలయంలో రుడా చైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిలరెడ్డి మాట్లాడారు. మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. మహిళలు మరింత అభివృద్ధిని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రుడా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తాళ్లపూడిలో ఘనంగా రథోత్సవం


ప్రజాశక్తి- తాళ్లపూడి

తాళ్లపూడి మదన గోపాలస్వామి వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా శనివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోకవరపు ఎక్కిశెట్టి వంశీకులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ నక్కా అనురాధ చిట్టిబాబు దంపతులు స్వామివారికి దుస్తులు అందించారు. బ్యాండ్ మేళాలు, బాణాసంచా కాల్పుల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం రాత్రి జరిగిన స్వామివారి కల్యాణోత్సవంలో పరసా కుటుంబీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మదన గోపాలునికి వెండి కిరీటం బహుకరణ

ప్రజాశక్తి - తాళ్లపూడి

వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన తాళ్లపూడిలోని రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామికి సర్పంచ్ నక్క అనురాధ, చిట్టిబాబు దంపతులు రూ.50 వేల విలువ గల వెండి కిరీటాన్ని బహూకరించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో సర్పంచ్ దంపతులకు స్వాగతం పలికాలరు. అనంతరం సర్పంచ్ దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయన కమిటీ సభ్యులు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వెండి కిరీటం బహూకరిస్తున్న సర్పంచ్ అనురాధ, చిట్టిబాబు దంపతులు

## కార్టూ'నిజం'




# ప్రతి కుటుంబానికీ జనసేన అండ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జనసేన పార్టీ ప్రతీ కుటుంబానికి అండగా ఉంటుందని, దీనిలో భాగంగానే ఇటీవల మరణించిన పార్టీ క్రియాశీల సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించామని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల మరణించిన పార్టీ క్రియాశీలక సభ్యుల ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షల చొప్పున ఆయన పంపిణీ చేశారు. అలాగే వివిధ ప్రమాదంలో గాయపడిన పది మందికి రూ.50వేల చొప్పున సాయం అందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అధ్యక్షతన స్థానిక ఆనం రోటరీ హాల్లో ఈ కారక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నాదెండ్ల విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జనసేన ప్రతీ కుటుంబంలో ధైర్యం నింపేందుకు చేస్తుందన్నారు. ఇప్పటం ప్రజలపై వైసిపి కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. జనసేన 10వ ఆవిర్భావ దినోత్సవానికి స్థలం ఇచ్చినందుకు కక్షపూరితంగానే 120 అడుగుల విస్తీర్ణం పేరుతో ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. మచిలీపట్నంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని కూడా అడ్డుకోవడానికి ప్రభుత్వం కుట్రతో వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటంలో అరెస్టు చేసిన 20మందిని తక్షణమే విడుదల చేయాలి లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ముల్లా శశిధర్, పంతం నానాజీ, వై.బాలకృష్ణ, అనుశ్రీ సత్యనారాయణ, వై. శ్రీనివాస్, సరోజ, స్వరూప, ప్రియ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నాదెండ్ల

# నేరాలు ఘోరాలు

## యానిమేటర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

భైరవపాలెం పంచాయతీ పరిధిలోని గంగా గ్రామైక్య సంఘం సభ్యులు శనివారం యానిమేటర్ గుర్రం వీరవేణిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐక్య సంఘంలో 18 డ్వాక్రా గ్రూపు సంఘాలు ఉన్నాయి. ఈ గ్రూపులకు గుర్రం వీరవేణి యానిమేటర్‌గా పని చేస్తున్నారు. ఆమె ఈ గ్రూపుల నుంచి స్త్రీనిధి, సంఘం మూలనిధి (సిఐఎఫ్) నుంచి ఆర్థిక అవకతవకలకు పాల్పడి రూ.8 లక్షల సొమ్ము స్వాహా చేసినట్లు ఫిర్యాదు చేశారు.

## గంజాయితో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ ఇటుక బట్టీలు సమీపంలో 21 కేజీల గంజాయితో ముగ్గురు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు స్థానిక ఇటుక బట్టీలలో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వారిలో ఎక్కువ ధనార్జన చేయాలని దురుద్దేశంతో గంజాయి రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు వారిపై ప్రత్యేక నిఘా పెట్టగా గంజాయితో పట్టుబడగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 21 కిలోల గంజాయిని స్థానిక తహశీల్దార్ ఐపి.శెట్టి, రావులపాలెం సిఐ ఎస్.రజనీకుమార్ సమక్షంలో స్వాధీన పరుచుకుని ముగ్గురుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రూ.50 వేల బియ్యం సీజ్

ప్రజాశక్తి-కాకినాడ

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాకు సంబంధించి శనివారం మూడు కేసులను విచారించి, సీజ్ చేసిన రూ.50 వేల విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు కాకినాడ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తం పౌర సరఫరాల ఖాతాకు జమవుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై నిత్యవసరాల చట్టం-1955, సెక్షన్ 6 ఎ ప్రకారం కేసులు నమోదు చేసి, జాయింట్ కలెక్టర్ వారి కోర్టు ముందుంచుతారు.

## పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వపై కేసు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పట్టణంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో సుమారు ఆరువేల కిలోల పిడిఎస్ బియ్యంను ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వచేసిన కేసులో గూడ శ్రీనివాసరావుపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం సివిల్ సప్లై డిటి మున్నంగి జోసెఫ్ కరణ్ ఆనంద్, రెవిన్యూ సిబ్బంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సిబ్బంది దాడులు చేసి 6000 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన గూడ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సివిల్ సప్లై డిటి జోసఫ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సిఐ దుర్గాప్రసాద్ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న మద్యం

## రూ.9 లక్షల మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

యానాం నుంచి తుని అక్రమంగా తరలిస్తున్న రూ.9 లక్షల విలువైన అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఇబి ఎఎస్‌పి పి.శ్రీనివాస్ తెలిపారు. యానాం నుంచి భారీ స్థాయిలో అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఒక వ్యాన్‌లో తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. యానాంకు చెందిన నక్కల శ్రీనివాస్, పాయకరావుపేట మండలం పెంటకోటకు బొందు జోగిరాజు, డ్రైవర్లు ఉప్పలగుప్తం మండలం, భీమనపల్లికి చెందిన వల్లూరి వీరబాబు, పలివెల మణికంఠను అరెస్ట్ చేసినట్టు చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. విజయవాడ నుంచి శ్రీకాకుళం తీర్థయాత్రలకు వెళ్తున్న భక్తుల టాటా మ్యాజిక్ వ్యాన్‌ను వెనుకనుంచి హైటెక్ బస్సు ఢీకొనడంతో వ్యాన్లో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. ఆ సమయంలో వ్యాన్‌లో తొమ్మిది మంది ఉన్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సహాయంతో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ ఘటనపై దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పెరవలి, గోకవరం

పెరవలి ఎస్ఆర్ పెట్రోల్‌బంకు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకరపర్రుకు చెందిన బొక్కా వాసుదేవ్ (20), పంపన శ్రీరాములు శుక్రవారం రాత్రి 10:30 గంటల సమయంలో కాకరపర్రు నుంచి బైకుపై పెరవలి వైపు బయలుదేరారు. వారు పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి చీకటిలో నిలిపిన లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వాసుదేవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శ్రీరాములును వైద్యం నిమిత్తం తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ పరిధి వెంకటాపురం గ్రామానికి చెందిన పండా వెంకన్నదొర (50) శుక్రవారం రాత్రి రామన్నపాలెం వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో వెంకన్న దొర అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# సాగునీటిపై ఆశలు.. వంటింట్లో మంటలు..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రబీ సాగుకు నీటి ఎద్దడి తలెత్తడంతో రైతులు తమ ఆశలు ఆవిరవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో డ్రెడ్జింగ్ పనులు చేపట్టకపోవటంతో నీటి నిల్వ శాతం తగ్గిపోయిన విషయం విదితమే. మరో వైపు కాల్వల పూడికతీత, ఆధునీకరణ పనులు చేపట్టకపోవటంతో శివారుకు నీరు పారే పరిస్థితులు కన్పించడం లేదు. సాగునీటి సలహా మండలి సమావేశంలో రబీసాగుకు నీటి ఎద్దడి లేకుండా సాగునీరు అందిస్తామని అధికార యంత్రాంగం హామీ ఇచ్చిన విషయం విదితమే. అధికార యంత్రాంగం ఇచ్చిన హామీతో జిల్లా వ్యాప్తంగా రైతులు సాగు ఆరంభించారు. ప్రస్తుతం అనేక మండలాల్లో వరి పంట పొట్టదశలో ఉంది. ఈ పరిస్థితుల్లో కాల్వలలో నీటి సరఫరా మందగించింది. మరో వైపు ఎండలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పంట పొలాలకు సకాలంలో నీరందించకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు సామాజికంగా స్పందించి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్ నెలలో కాల్వలకు నీరు సరఫరా నిలిపివేసి పూడికతీత పనులు చేపట్టడం పరిపాటి. ఈ పనులకు సంబంధించి ఫిబ్రవరి లేదా మార్చిలో టెండర్లు పిలుస్తుంటారు. ఈ ఏడాది టెండర్ల ప్రక్రియ ప్రారంభానికి నోచుకోకపోవటం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం పూడికతీత, ఆధునీకరణ పనులపై దృష్టి పెట్టకపోతే ఎలా అనే ప్రశ్న తలెత్తుతోంది.

**గ్రాసిమ్ విస్తరణకు ప్రజల విముఖత**

గ్రాసిమ్ ఇండస్ట్రీస్ విస్తరణకు చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ విజయవంతమయ్యింది. గతవారంలో బలబద్రపురం హైస్కూల్లో ప్రజాభిప్రాయ




సేకరణ నిర్వహించిన విషయం విదితమే. ఈ కార్యక్రమ నిర్వహణ నేపథ్యంలో ముందు రోజు పోలీసులు పెద్ద ఎత్తున అక్కడ గ్రామంలో కవాతు నిర్వహించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. కాలుష్య కారకమైన గ్రాసిమ్ సంస్థ అక్కడి ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి విస్మరించిందని ప్రజలు గుర్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజలు ధైర్యంగా తమ వాణిని వినిపించారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పిస్తామంటూ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోకపోవటం ప్రధాన కారణమని తెలుస్తోంది. అంతే కాకుండా గ్రాసిమ్ సంస్థ సంవత్సరానికి 30 వేల టన్నుల బొగ్గును మండిస్తూ కాలుష్యానికి కారణమవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా కాలుష్య నివారణకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని కలెక్టరుకు వివరించారు. కలెక్టరు సానుకూలంగా స్పందించి కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

**మార్చిలోనే మొదలైన మంటలు**

ఏటా మేలో భానుడు తన ప్రతాపం చూపటం పరిపాటి. అయితే ఈ ఏడాది రెండు నెలల ముందుగానే మంటలు మొదలయ్యాయి. వాతావరణ శాఖ ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించిన విషయం విదితమే. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత క్రమక్రమంగా పెరుగుతోంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సరాసరిన 38 డిగ్రీల సెల్సియస్ నమోదవుతోంది. మరో వైపు కనిష్ట ఉష్ణోగ్రతలు 21 డిగ్రీల సెల్సియస్ నుంచి 23 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితమవుతోంది. దీంతో రాత్రి వేళల్లో చలి తీవ్రత తగ్గడంలేదు. ఉష్ణోగ్రతలలో మార్పులు అనారోగ్యాలకు కారణమవుతోంది. ప్రతి ఐదు కుటుంబాలలో ఒకరికి జలుబు లేదా దగ్గు వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. దీంతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గడిచిన వారం రోజుల్లో గణనీయంగా ఔట్ పేషెంట్ల సంఖ్య పెరిగింది. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను మరింత బలోపేతం చేసి నాణ్యమైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**వంటింట్లో గ్యాస్ మంటలు**

బిజెపి ప్రభుత్వం మరో సారి గ్యాస్ ధరను మండించడంతో వంటిల్లు భగ్గుమంటోంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే ధరల బండ మోపింది. తాజా పెంపుతో 14 కేజీల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెరగటంతో సుమారు రూ.1,174కు చేరింది. వాణిజ్య సిలిండర్ ధర రూ.350 పెరగటంతో రూ.1769 నుంచి రూ.2,119కి చేరింది. జిల్లాలో నెలకు దాదాపు 7.50 లక్షల గ్యాస్ సిలిండర్ల వినియోగం ఉంటుందని ఒక అంచనా. దీంతో అక్షరాల రూ.3.5 కోట్ల భారం పడిందని తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ల ధర పెంపు చిరువ్యాపారులకు గోరు చుట్టుపై రోకలి పోటులా మారిందని చిరు వ్యాపారులు వాపోతున్నారు. సామాన్యుల నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలు చేస్తున్నా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రశ్నించిన దాఖలాలు కన్పించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనసేన సైతం అదే బాటలో పయనించటం ఆ పార్టీ శ్రేణులను కలవరానికి గురి చేస్తోంది. సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు మాత్రమే నిత్యం ప్రజల్లో ఉంటూ ధరల పెరుగుదలను నియంత్రించాలని పోరాటాలు చేస్తున్నాయి.

## ఏడుగురికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-కాకినాడ


ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఏడుగురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 18 ఏళ్ల లోపు పెళ్లి నేరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 ఏళ్ల లోపు వివాహం చేయడం నేరమని జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్.వెంకట్రావు పేర్కొన్నారు. శేషాద్రి నగర్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'బేటీ బచావో - బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి సంబంధమని, మేనరికమని కారణాలతో ఆడపిల్లలను చదువుకునే వయసులోనే 18 ఏళ్లలోపు అమ్మాయిలకు వివాహం చేయడం సామాజికంగా, ఆరోగ్యపరంగా పలు సమస్యలకు కారణమవుతుందన్నారు. చిన్న వయసులోనే గర్భం వస్తే ప్రసవ సమయంలో ప్రాణానికి ప్రమాదమని, పిల్లలు కూడా బలహీనంగా పుట్టే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లలోపు అమ్మాయికి వివాహం చేస్తే ఉభయ పక్షాలతో పాటు పెళ్లి కుదిర్చిన వారిని, పెళ్లికి హాజరైన వారికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉన్నందున బాల్య వివాహాలను అరికట్టాలని వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవాల్లో పాల్గొన్న ప్రజలు

## ఘనంగా మీసాల వెంకన్న కల్యాణోత్సవం

ప్రజాశక్తి - యానాం

మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన యానాం వెంకటేశ్వరరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక బాలాలయం వద్ద స్వామి వారి కళ్యాణాన్ని ప్రముఖ వేదపండితులు వాడపల్లి గోపాలాచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు, రుత్వికులు కనులపండువుగా జరిపించారు. చింతా వెంకట సుబ్బారావు కుమాంలు పూజల్లో పాల్గొన్నారు. యానాం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, లక్ష్మీ స్నేహ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలు సమర్పించారు. పరిపాలనాధికారి మునిస్వామి దంపతులు, ఎస్‌పి రఘునాయగం, డిటి సత్యనారాయణ, కమిషనర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

## నిషేధిత పొగాకు ఉత్పత్తుల సీజ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ తమ సిబ్బందితో డైరీ ఫారం సెంటర్‌లో ఉన్న కిరాణా షాపుల్లో శనివారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఫుడ్ ఇన్ స్పెక్టర్ నాగూర్ మీరా పలు రకాలైన పొగాకు సంబంధిత ప్యాకెట్లు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తుని పట్టణానికి చెందిన ఒక వ్యాపారి కాకినాడ సాంబమూర్తి నగర్‌కు చెందిన మరో వ్యాపారి సహకారంతో విమల్, జర్దా, మీరజ్, రాజా ఖైనీ వంటి పొగాకు సంబంధిత నిషేధిత ఉత్పత్తులను కర్ణాటకలో కొనుగోలు చేసి తునిలో నిల్వ చేస్తున్నారు. కాకినాడ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి- కరప

గురజానపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసినట్టు ఎస్ఐ నౌడు రామకష్ణ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. రూ.35 వేల నగదు, ఐదు బైకులను స్వాధీనం చేసుకుని జూదరులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

# పురుగు మందుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



అవగాహన కల్పిస్తున్న జెడిఎ విజయకుమార్

రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించుకునేలా గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్ సూచించారు. శనివారం సామర్లకోట వ్యవసాయ విత్తనోత్పత్తి అనుసరణీయ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు వ్యవసాయ శాఖ ఎడిఎ జివి పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించిన పొలంబడి శిక్షణ కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. దాళ్వా పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పురుగులు మరియు తెగుళ్ల లక్షణాల గుర్తింపు మరియు వాటి అధిక నష్ట పరిమితి స్థాయి మిత్ర పురుగుల గుర్తింపు, వివిధ రకాల శత్రు పురుగులను అంతం చేసే మిత్ర పురుగుల అధ్యయనం, తెగుళ్లు మరియు పురుగుల ఉధతికి దోహదపడే వాతావరణ పరిస్థితులు, గట్లపై కలుపు నివారణ యొక్క అవశ్యకత గూర్చి వివరించాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. వరి పంటలో సమగ్ర సస్య రక్షణ సమగ్ర పంటల యాజమాన్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో సాగుచేస్తున్న పంట పొలాలను పరిశీలించి, ఆయా అంశాలపై గ్రూపుల వారీగా రివ్యూ చేసి జెడిఎ పలు సూచనలు ఇచ్చారు. ఎడిఎ పద్మశ్రీ, మండల వ్యవసాయ అధికారులు చీకట్ల సత్యనారాయణ, టివిఆర్.మణిదీప్, ఇమ్మిడిశెట్టి సత్య, హబ్ మేనేజర్ ఎంకెవి లక్ష్మి, ఎఇఒలు, మూడు మండలాలకు చెందిన విఎఎలు పాల్గొన్నారు.

## టిడిపిలో పలువురు నాయకుల చేరిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన బిసి నాయకులు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. అచ్చంపేట క్యాంప్ కార్యాలయంలో వారికి ఎంఎల్‌ఎ చినరాజప్ప పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి చురుకుగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తనయుడు నిమ్మకాయల రంగనాథ్, పార్టీ నాయకులు చల్లా సత్యనారాయణ (బుజ్జి), పి.చంద్రశేఖర్, జి.గణేష్, కె.మునలయ్య, పి.సత్తిబాబు, పి.రమణ, కె.శ్రీను, వి.శివ గణేష్, జి.రాజు, జి.సత్తిబాబు పాల్గొన్నారు.

## సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాజోలు

ఎనిమిది సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్న సువర్ణ ఇండియా భాదితులకు న్యాయం చేయాలని సువర్ణ ఇండియా బాధితుల సంఘం అధ్యక్షుడు కాశీ వెంకట్రావు కోరారు. శనివారం రాజోలు అంబేద్కర్ భవనం నందు సువర్ణ ఇండియా బాధితుల సమావేశం జరిగింది. ఈ సంద్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఇప్పటికే రెండు సార్లు ఎపి సిఎం జగన్‌కు సువర్ణ ఇండియా బాధితులంతా మెమెరాండం సమర్పించామని అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ప్రభుత్వం సీజ్ చేసిన భూములను స్వాధీనం చేసుకుని సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సువర్ణ ఇండియా బాధితుల సంఘం కార్యదర్శి కానూరి తులసీ రావు, కొంబత్తుల అనిల్, నాగాబత్తుల వెంకటరమణ, జి. కష్ట, జి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ సామగ్రి అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక 41వ డివిజన్‌లోని యువతకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) భవాని ఛారిటబుల్ ట్రస్టు తరపున ఆట వస్తువులు అందచేశారు. గతంలో ఈ డివిజన్‌లో పర్యటించిన సందర్భంలో స్థానిక యువకులు కంబాలపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న మున్సిపల్ మైదానంలో ఆడుకునేందుకు ఆట సామగ్రి, అమ్మ వారి ఆలయం వద్ద కూర్చునేందుకు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయలని కోరారు. వారి అభ్యర్థనపై స్పందించిన ఆదిరెడ్డి వాసు తమ ట్రస్టు ద్వారా ఆట వస్తువులు, సిమెంట్ బల్లలను సమకూర్చారు. ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు తామెప్పుడూ ముందుంటామన్నారు. తమ ట్రస్టు తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చుక్కా నూకరాజు, అన్నవరం, మళ్ల వెంకటరాజు, వింజమూరి సత్యనారాయణ, సింహా వెంకటేష్, వానపల్లి శ్రీనివాస్, మోతా పండు, దొండపాటి రాజు పాల్గొన్నారు.

## బిసి హాస్టల్‌లో ఆదిరెడ్డి తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక వై.జంక్షన్ సమీపంలోని బిసి బాలుర వసతిగృహంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు టిడిపి నాయకులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమస్యలు నెలకొన్నాయని, వసతిగృహం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడం లేదనే విషయాన్ని తెలుసుకున్న ఆయన దీన్ని సందర్శించారు. వంట గది, రీడిరగ్ రూమ్, మరుగు దొడ్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ అధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమస్యలు పరిష్కరించే వరకూ తమ పార్టీ నాయకులతో కలిసి వసతిగృహం వద్ద బైటాయిస్తామని హెచ్చరించారు. ఇటీవల ఒక విద్యార్థి సెలవు చీటీ ఇవ్వలేదని వార్డెన్ కొన్ని రోజులుగా అన్నం పెట్టడం లేదన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉందని, మరుగుదొడ్లకు తలుపుల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. రీడింగ్ రూమ్‌లో టైల్స్ చిధ్రమై విద్యార్థులు కూర్చోలేకపోతున్నారని, లైట్లు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. తమ భవాని ఛారిటబుల్ ట్రస్టు తరపున ఆదిరెడ్డి వాసు ట్యూబ్ లైట్లను సమకూర్చారు. ఆయన వెంట నాయకుల మజ్జి రాంబాబు, నక్కా దేవీవరప్రసాద్, మెహబూబ్ జానీ, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బొర్రా చిన్ని, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విజయవాడ స్మృతివనంలో అంబేద్కర్ కాంస్య విగ్రహం పక్కనే జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జిల్లా నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సృజనరావు మాట్లాడారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వంపై డిమాండ్ చేస్తూ ఈనెల 24న విజయవాడలోని గాంధీనగర్ ఐలాపురం కన్వెన్షన్ హాల్ వద్ద ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దళిత గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ యార్లగడ్డ వెంకటరత్నం, ఎస్.గిఫ్ట్‌బాబు, చీలి సురేష్, చెట్టే మధు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రికవరీ శాతం పెంపునకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

వివిధ సబ్ ప్లాన్ల ద్వారా మంజూరు చేసిన సబ్సిడీ లోన్ల బకాయిలు అధికంగా ఉన్నాయని, రికవరీ శాతాన్ని త్వరితగతిన వృద్ధి చేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.శామ్యూల్ సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో మండల ఇంచార్జ్ ఎపిఎ మందపల్లి ధనరాజు ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.ఉమాశ్రీ అధ్యక్షతన సమీక్షా సమావేశం శనివారం ఆయన నిర్వహించారు. ముందుగా సమావేశ ముఖ్య అంశాలు చర్చించారు. ప్రాజెక్ట్ ప్రాధాన్యతా అంశాలైన జగనన్న తోడు, బ్యాంక్ లింకేజీ రుణాలు మొదలగు అంశాలలో లక్ష్యాలను, అచీవ్మెంట్ పై చర్చించారు. స్కూల్ డ్రాపౌట్ చిల్డ్రన్, బాల కార్మికులు, బాల్య వివాహాలు హరికట్టడంలో స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల పాత్ర వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సిసిలు సుబ్బారావు, భీమరాజు, అకౌంటెంట్ కుమార్, గ్రామ సంఘం విఒఎలు పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న దాతలు

## బాలిక వైద్యానికి దాతల సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని గణేష్ కాలనీకి చెందిన ముద్రగడ్డ యేసు రాజు కుమార్తె అరుణ కుమారి ఇటీవల ఆనారోగ్యానికి గుర్వైంది. బాలికను వైద్యం కోసం హైదరాబాదుకు తరలించగా డాక్టర్లు చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని, దీని నిమిత్తం రూ.4.50 లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ. 5 వేలు పెదపళ్ల సొసైటీ అధ్యక్షులు నెక్కంటి వెంకటరాయుడు రూ. 5 వేలు మొత్తం కలిపి శనివారం రూ.10 వేలు అందజేసి వారి కుటుంబాన్ని ఓదార్చారు.

## పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

సిఎం జగన్ పవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన బాధ్యత గృహసారథులపైనే వుందని కౌన్సిలర్ మున్సిపల్ చీఫ్ విప్ వాడ్రేవు సాయి ప్రసాద్ అన్నారు. యనమదల గ్రామంలో కన్వీనర్లు గహ సారథులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సిఎం పని చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు గహ సారథులను, సచివాలయ కన్వీనర్లను నియమించారన్నారు. ఇంటింటికి పథకాలు చేరేలా చూడాలని చెప్పారు. అందుకు అందరూ సమిష్టిగా కషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపన వెంకట రమణ, ఎంపిటిసి సభ్యుడు రామకష్ణ, కన్వీనర్లు కుక్కల గోవిందు, పెయ్యల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు టిడిపి తరుపున కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక 39వ డివిజన్‌లో వాంబే గృహాలను టిడిపి నాయకులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఏకరువుపెట్టారు. సక్రమమైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. సెప్టిక్ ట్యాంకుల సమస్యలను కూడా ఆయన దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహిళలు విన్నవించిన సమస్యలను నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు బుడ్డిగ రాధాకృష్ణ, టిడిపి డాక్టర్స్ సెల్ అధ్యక్షులు యాళ్ల ప్రదీప్, మాజీ కార్పొరేటర్ గొర్రెల రమణి తదితరులున్నారు.


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులతో శ్రీనివాసరావు

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలతో బాటు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని ఇఎమ్‌బిపి డిఎం ఉదయకుమార్ అన్నారు. స్థానిక ఎస్‌విఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎంట్రీ ప్రిన్యూరల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రత్యేక శిక్షణ తరగతులను ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఇఎమ్‌బిపి డిఎం ఉదయకుమార్ శనివారం పరిశీలించారు. కార్యక్రమలో ట్రైనర్ ప్రసాద్, శ్రీనివాసరావు, ఇన్చార్జ్ హెడ్ మాస్టర్ ఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి కల్యాణం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగరలో వేణు గోపాల స్వామి దివ్య కల్యాణం వైభవంగా జరిగింది. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఆలయ చైర్మన్ కట్టా రామచంద్రమూర్తి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల యాత్రికులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎఎస్‌బిజె.రామలింగం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ప్రకటన**

DHR: శ్రీ గుడివాడ నరసింహారావు, S/o సత్యనారాయణ మూర్తి, హిందూ, వయస్సు 75 సం॥, పురుషుడు, వ్యాపారం, రామ్ నగర్, ఉమెన్స్ కాలేజీ రోడ్డు, నిడదవోలు, నిడదవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా...NDDJCJC
AND
JDRS :1) శ్రీ మద్దుల దుర్గారావు, S/o విశ్వనాథం, హిందూ, వయస్సు 57 సం॥, పురుషుడు, వ్యాపారం, మునిపల్లి, నిడదవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా...NDDJCJC
2) శ్రీ మద్దుల తిరుపతేశ్వర రావు, S/o విశ్వనాథం, హిందూ, వయస్సు 48 సం॥, పురుషుడు, వ్యాపారం, మునిపల్లి, నిడదవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా...NDDJCJC
యీ నెంబరుతో Notice కోర్టు ద్వారాను, Regd Post ద్వారాను JDRS కు అనేక పర్యాయములు పంపించినన్నూ అమలు జరుగనందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం యీ ప్రకటన వేయడమైనది.
యీ నెంబరులో 1వ JDR అయిన శ్రీ మద్దుల దుర్గారావు, S/o విశ్వనాథం, మునిపల్లి 2వ JDR అయిన శ్రీ మద్దుల తిరుపతేశ్వర రావు, S/o విశ్వనాథం మునిపల్లె అనువారు **ది.27-3-2023వ తేదీ ఉదయం 10.30లకు** శ్రీ కోర్టు వారు పిలిపించే టైముకు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరచుకోవలెను. లేనియెడల Exparteeచేసి పరోక్షమున తీర్మానించడమగును.
వాయిదా 27-3-2023.

P.Venkanna Babu
Adocate
Nidadavole, E.G.Dt
Cell : 93476 26143

ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
**I.A.No. 02/2022**
బిట్వీన్:
పిటీషనర్లు: మజ్జి నాగమణి వగైరా
మరియు
రెస్పాండెంట్లు: గుడవిల్లి గోవిందరాజు వగైరాలు
నోటీసు
ఆర్-7: గండేట్టి కిషోర్ కుమార్, చిన్నప్ప, వయస్సు 41, డో.నెం.1-113, మద్రివిడు, ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా.
పై నెంబరు ఐ.పి.లో పిటీషనరు పిటీషను దాఖలు చేసుకున్నందున సదరు ఐ.పి.లో ఆర్-7 అయిన మీకు ఏమైనా, ఏవిధమైన ఆక్షేపణలు మరియు లావాదేవీలు, బాకీలు గాని ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.21-03-2023న ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు హాజరు అయ్యి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు స్వయంగా గాని, వకీలు దారా గాని హాజరయ్యి తెలియపరుచుకోవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

బుగత వెంకట శివనారాయణ
అడ్వకేట్, ప్రత్తిపాడు.
సెల్: 98490 64436

**IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE cum M.A.C.T, AT: VISAKHAPATNAM**
**M.O.P.257/2021**
**Between:**
Sadireddy Satynarayana & others ...Petitioners
**And:**
Bhupati Raju Hari Krishnaraju & 2 others ...Respondents
**NOTICE**
To,
**Respondent No. 2:**
**Velugula Veerababu,**
S/o. Chakram, Hindu, aged 36 years, R/at B. Pattipadu, Gollaprolu Post, Pithapuram Mandal, East Godavari District.
Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against you and other respondents claiming compensation and the matter stands posted to **24-03-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **24-03-2023** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
**B. RAMA GOPALA RAJU, CH. GEETHA,** Advocates
Narsipatnam, **Cell: 9494189512**